నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



మణికొండ: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా శనివారం నార్సింగి గ్రామం, నార్సింగి హైట్స్, క్యూబా కాలనీ, క్వాస్వా కాలనీ వివేకానందనగర్ కాలనీలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు నార్సింగి ఏఈ మణికంఠ తెలిపారు. కోకాపేట సబ్‌స్టేషన్ పరిధిలో 250 గజాల కాలనీ, గోల్డన్ మైల్, బాబుఖాన్ విల్లాస్, గ్రాండ్ ఇన్నాటిక్ విల్లాస్, దంతు స్వీట్ హౌస్ ప్రాంతాలలో ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ ఉండదని ఆయన వివరించారు.

మణికొండ పరిధిలో...

మణికొండ: మణికొండ పరిధిలో కొత్త విద్యుత్ సర్వీసులను విడుదల చేస్తున్నందున శనివారం ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు క్రిన్స్ విల్లాస్, నెమలినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు సాయిగౌతమ్ కాలనీ, సాయి చంద్ర కాలనీ, గ్రీన్ స్పేస్ ప్రైమ్, గ్రీన్ స్పేస్ సిగ్నిచర్ కమ్యూనిటీలు, మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.30 గంటల వరకు హనుమాన్‌నగర్, శివపురి కాలనీ, శ్రీనివాస కాలనీ, హాల్‌మార్క్ విల్లాస్, ఎస్ఆర్ డీజీ స్కూల్ కాలనీలలో విద్యుత్ ఉండదన్నారు. తిరిగి మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1.30 గంటల వరకు అలకాపూర్ సెక్టార్ 2ఎ, సెక్టార్ బీ, సెక్టార్ సీ, సెక్టార్ డి, సెక్రటేరియట్ కాలనీ, ఆదిత్య ఫోర్ట్ విల్లాల ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వివరించారు.

మూసీని మింగేస్తున్నారు!

కబ్జా కోరల్లో పరీవాహక ప్రాంతం

- మట్టితో పూడ్చేస్తున్న ఆక్రమణదారులు
- సుందరీకరణ పనులకు విఘాతం
- పర్యావరణానికీ పెనుముప్పు
- మామూళ్ల మత్తులో నియంత్రించాల్సిన యంత్రాంగం!

అత్తాపూర్: మూసీ నది అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. అంతేస్థాయిలో అన్నట్టు కబ్జాదారులు ఇష్టారాజ్యంగా మూసి పరీవాహక ప్రాంతాన్ని గృహ నిర్మాణ వ్యర్థాలు, శిథిలమైన కాంక్రీట్ దిమ్మెలను ట్రక్కుల్లో తీసుకొచ్చి డంప్ చేస్తూ కబ్జాలకు పాల్పడుతున్నారు.

◆ అత్తాపూర్ మూసీ బ్రిడ్జి హనుమాన్ టెంపుల్ చౌరస్తా వద్ద పిల్లర్ నెంబర్ 117 నుంచి ఇటీవల కొత్తగా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. అత్తాపూర్ హనుమాన్ జంక్షన్ నుంచి అంబియన్స్‌పోర్టు మీదుగా లంగర్‌హౌస్ బాపూఘాట్ బ్రిడ్జి వరకు ఆ రోడ్డును అనుసంధానం చేస్తారు.

◆ అత్తాపూర్ ప్రాంతంలో భూములకు మంచి ధర ఉంది. దానికి తగ్గట్టుగా రోడ్ల నిర్మాణం లేదు. ఇది తమకు నష్టదాయకమని భావించి డిమాండ్‌కు అనుగుణంగా రియల్టర్లు బాపూఘాట్ బ్రిడ్జి నుంచి దాదాపు కిలోమీటర్ మేరకు రాత్రి పగలు లేకుండా భారీ వాహనాల్లో మట్టిని తీసుకొచ్చి పోస్తూ కబ్జా చేస్తున్నారు. భారీ యంత్రాలు, రోడ్డు రోలర్ల సాయంతో రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. ప్రభుత్వం చూపెడుతున్న హైడ్రా లెక్కల ప్రకారం మూసీ పరీవాహక సరిహద్దులు కనిపించకుండా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. డిమాండ్ మేరకు వసతులు కల్పిస్తూ... అందుకు ఢిల్లీ స్థాయిలో పైరవీలు చేసి బహుళ అంతస్తుల నిర్మాణాలను క్రిస్టల్ గార్డెన్‌లో నిర్మిస్తున్నారు. ఒకదాన్ని మించి మరొక నిర్మాణం ఉండేలా భారీ భవంతులను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాజకీయ పలుకుబడి... చట్టాల్లో ఉన్న లొసుగులను ఆధారంగా చేసుకొని కబ్జాలు మొదలుకొని విక్రయాలు ఇతరత్రా అక్రమాలను బిల్డర్లు ముమ్మరం చేశారు.



అత్తాపూర్ పరిధిలో ఆక్రమణలకు గురైన మూసీ పరీవాహక ప్రాంతం



టిప్పర్‌లో మట్టిని తీసుకొచ్చి డంప్ చేస్తున్న దృశ్యం

◆ మూసీ నది సుందరీకరణ నేపథ్యంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేనందున ఈ అడ్డగోలు నిర్మాణాలు, చెత్తాచెదారాలు మట్టి ఇతర వ్యర్థాలతో మూసీ నదిని నింపేస్తున్నారు.

◆ వ్యర్థాలను తీసుకొచ్చే భారీ ట్రక్కులను సైతం మూసీ నది పరీవాహక ప్రాంతాల్లోనే పార్కింగ్ చేయడం గమనార్హం.

◆ ఇలాంటి వాహనాలను వెంటనే సీజ్ చేస్తే వ్యర్థాలను డంప్ చేసే అవకాశం ఉండదు. ఈ మేరకు జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులు, ట్రాఫిక్ పోలీసు అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

డంపింగ్ వాహనాలపై చర్యలు తీసుకోవాలి



పాత ఇళ్లను కూల్చి కొత్తవి నిర్మించే వారు ఆయా వ్యర్థాలను సీఅండ్‌డీ ప్లాంట్‌కు తరలించాలి. ఆ ఖర్చును తగ్గించుకునేందుకు రాత్రిళ్లు లారీలు, టిప్పర్‌లలో రోడ్ల వెంట ఎక్కడ ఖాళీ స్థలాలు కనబడితే అక్కడ డంప్ చేస్తున్నారు. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ డంపింగ్ లారీలు, టిప్పర్లపై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.

– రాచూరి రాజశేఖర్, అత్తాపూర్

వసతులు కల్పించాలి



మౌలిక వసతులను కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ప్రభుత్వ భూములు, దేవాలయ భూములు, నాలాలు మూసీ నది పరీవాహక ప్రాంతం ఎవరికి వారు యథేచ్ఛగా కబ్జా చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు స్థానికంగా జరుగుతున్న అక్రమాలను గమనిస్తూ వాటిని అరికట్టాలి.

– ఉమామహేశ్వరిరెడ్డి, జనహిత సొసైటీ

సుందరీకరణకు సహకరించాలి

మూసీ నది సుందరీకరణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా మూసీ పరీవాహక ప్రాంతవాసులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి. అత్తాపూర్ మూసీ నది పరీవాహక ప్రాంతంలో ట్రక్కుల్లో గృహ నిర్మాణాల వ్యర్థాలను తీసుకొచ్చి డంప్ చేస్తున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం.

– బొమ్మ రాములు, తహసీల్దార్, రాజేంద్రనగర్

రమాబాయి అంబేడ్కర్‌కు నివాళి

రాజేంద్రనగర్: మాత రమాబాయి అంబేడ్కర్ జయంతి సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ జై భీమ్ జై రామ్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్, రమాబాయి అంబేడ్కర్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... అట్టడుగు వర్గాలు, పేదల సామాజిక సమానత్వం కోసం ఆమె జీవితాన్ని అంకితం చేశారన్నారు. అధ్యక్షుడు పచ్చ నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎల్లకాడి సూర్యం, మాజీ అధ్యక్షుడు పంబాల రాజు, నేతలు మంత్రి చంద్రశేఖర్, అడ్వజర్ డాక్టర్ వి.శ్రీరాములు, గొడుగు సంజీవ, వీర్లపల్లి నవీన్, బండి నర్సింహా, గోల్కొండ ఉపేందర్, ఎల్లకాడి చంద్రశేఖర్, బి.ఆర్.సుమన్, కనకమామిడి ప్రవీణ్, పత్యారా నర్సింహా, కొత్తపల్లి సంతోష్, శంకర్, చాంది, జేమ్స్ పాల్గొన్నారు.

ఈవీఎంల గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్



ఈవీఎం గోడౌన్ వద్ద కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ఈవీఎంల గోడౌన్‌ను శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పరిశీలించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిగింది. ఈవీఎంల గోడౌన్‌కు వేసిన సీల్‌లను పరిశీలించి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలి



విద్యార్థులకు భోజనం అందజేస్తున్న దృశ్యం

బండ్లగూడ: సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్ అన్నారు. గత సంవత్సరం నవంబర్ 18న మరణించిన ఆయన కుమారుడు రవికిరణ్ ముదిరాజ్ జయంతి సందర్భంగా బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వద్ద రోగులు వారి సహాయకులకు మధ్యాహ్న భోజనాన్ని పంపిణీ చేశారు. అలాగే హైదర్షాకోట్ కస్తూర్బా గాంధీ, బండ్లగూడ జాగీర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు నోట్ పుస్తకాలు, స్టేషనరీ సామగ్రిని అందజేశారు.

నిబద్ధతతో ఉద్యోగం చేయడం భేష్



పదవీ విరమణ పొందిన ఉద్యోగిని సన్మానిస్తున్న పీఏసీఎస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు

శంషాబాద్: నిబద్ధతతో ఉద్యోగ జీవితాన్ని పూర్తి చేయడం గొప్ప విషయమని శంషాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ముద్దం మల్లారెడ్డి అన్నారు. శంషాబాద్ పీఏసీఏస్‌లో ఉద్యోగిగా పనిచేసి విరమణ పొందిన కొంకరి వెంకటేష్‌ను శుక్రవారం పాలకవర్గం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ సాధారణమైందన్నారు. ఉద్యోగం తర్వాత కూడా కొత్త ప్రయాణం మొదలు పెట్టాలని ఆయన ఆకాంక్షించారు. పాలకవర్గం ఉపాధ్యక్షుడు జ్ఞానేశ్వర్ యాదవ్ సభ్యులు రంగారెడ్డి కరుణాకర్ రెడ్డి, మాదిరెడ్డి సురేందర్‌రెడ్డి, గుర్రంపల్లి శ్రీనివాస్, కొత్త పోచయ్య, పీఏసీఎస్ సీఈఓ అర్జున్, జగన్‌మోహన్‌రెడ్డి, సదాశివరెడ్డి, ఫిలోమెన్‌రాజు, రాంరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



షేక్ షబ్బీర్ అలీ

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ షమా కాలనీకి చెందిన షేక్ షబ్బీర్ అలీ(40) ఈ నెల 1వ తేదీన ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేశారు. ఆచూకీ లభించకపోవడంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలికతో స్కూల్ బస్సు డ్రైవర్ అసభ్యకర ప్రవర్తన

- పాఠశాల వద్ద బాధితులు, విద్యార్థి సంఘాల ఆందోళన
- డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు



పాఠశాల ముందు ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాలు..

శంషాబాద్: ఒకటో తరగతి చదివే ఆరేళ్ల చిన్నారితో పాఠశాల బస్సు డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. విషయం తెలిసిన తల్లిదండ్రులతో పాటు విద్యార్థి సంఘాలు పాఠశాల ముందు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఈ సంఘటన శంషాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఇన్‌ఫాంట్ జీసస్ పాఠశాల యాజమాన్యం ఈ నెల 4వ తేదీన విద్యార్థులను విహార యాత్రలో భాగంగా ఓ రిసార్ట్స్‌కు తీసుకెళ్లారు. మూత్ర విసర్జన కోసం బాలికను పక్కకు తీసుకెళ్లాలని ఓ టీచర్ చెప్పడంతో బస్సు డ్రైవర్ ఆ బాలికను పక్కకు తీసుకెళ్లాడు. మూత్ర విసర్జన అనంతరం బాలిక ప్రైవేటు భాగాల్లో గట్టిగా అదిమి అసభ్యకరంగా ప్రవర్తించాడు. శుక్రవారం బాలిక తనకు నొప్పిగా ఉందని తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం తల్లిదండ్రులు వారి బంధువులు పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. డ్రైవర్లను వరసగా నిల్చోబెట్టి ఎవరు చేశారని పోలీసులు అడగడంతో జోసఫ్‌రెడ్డి డ్రైవర్‌ను చూపించడంతో ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పాఠశాల వద్ద ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ నాయకులతో పాటు మున్సిపల్ మాజీ చైర్మన్ బండిగోపాల్ యాదవ్‌లు ఆందోళన చేపట్టగా పోలీసులు వారిని సముదాయించారు. సంఘటన మంచాల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరగడంతో కేసును అక్కడికి బదలాయించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడా సామగ్రిని అందించిన ఓక్రిడ్జ్ విద్యార్థులు

మణికొండ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, వారికి అవసరమైన తోడ్పాటును అందిస్తామని బీఆర్ఎస్ మణికొండ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు డి.సీతారాం అన్నారు. శుక్రవారం మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు అర్జున్, రిత్విక్, దివ్యాన్ష్‌లు క్రీడా సామాగ్రి, ఒక సైకిల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలతో మంచి స్నేహసంబంధాలు, శారీరక దారుఢ్యం ఏర్పడుతుందన్నారు. తమ పాఠశాల విద్యార్థులు చదువులో మండలంలోనే మొదటి స్థానంలో నిలవటంతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారన్నారు. తమ విద్యార్థిని సాత్వికా నిహారి 600, 300 మీటర్ల అండర్–14 లాంగ్ జంప్‌లో పతకాలు సాధించిందని ప్రధానోపాధ్యాయుడు నిరంజన్ తెలిపారు. షార్ట్‌పుట్‌లో హరినాథ్‌రెడ్డి, భరత్, 400 మీటర్ల పరుగుపందెం, చంద్రమో, దీపక యోగాలో రాణించారన్నారు. క్యారమ్స్‌లో జస్వంత్‌జాయ్, శివగణేష్, వరుణ్, ధనేష్, ఖోఖోలో చంద్రమోహన్ టీం, కబడ్డీలో భరత్‌టీం, బ్యాడ్మింటన్‌లో చరణ్, వెంకట్‌రెడ్డిలు రాణించారని ఆయన వివరించా. పీటీ మాస్టర్ కుమార్, బీఆర్ఎస్ మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, నాయకులు ఎం.లక్ష్మయ్య, మాల్యాద్రినాయుడు, ఎ.లక్ష్మణ్‌రావు, ఎ.శ్రీకాంత్, ఎస్.శ్రీకాంత్, బి.బాబు, రాఘవేందర్, కిరణ్, ఆరీఫ్, సుమ, నళిని, అన్షు, బిందు, రేఖ పాల్గొన్నారు.

బాలికపై అఘాయిత్యం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు



నిందితుడు సోనూశర్మ

రాజేంద్రనగర్: మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన ఓ ఆటో డ్రైవర్‌కు రాజేంద్రనగర్ స్పెషల్ పోక్సో కోర్టు న్యాయమూర్తి పది సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించారు. అలాగే బాధితురాలికి రూ. 6 లక్షల నష్ట పరిహారం అందించాలని ఆదేశించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... చార్మినార్ ఘాన్సీబజార్ సోనూ శర్మ(35) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శాస్త్రీపురం వద్ద ఓ వాటర్ ప్లాంట్‌లో పని చేసేవాడు. 2016లో ఇదే ప్రాంతానికి చెందిన పదో తరగతి చదువుతున్న మైనర్ బాలికను మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడటంతో బాలిక గర్భం దాల్చింది. పదో తరగతి పరీక్షల అనంతరం మైనర్ బాలిక కర్ణాటకలోని తన స్వగ్రామానికి వెళ్లింది. అక్కడ అనారోగ్యానికి గురైంది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా గర్భవతిగా తేలింది. దీంతో కర్ణాటకలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడి కేసును పోలీసులు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి శుక్రవారం పై మేరకు తీర్పు వెలువరించారు. నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ. 5 వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ. 6 లక్షలు చెల్లించాలని ఆదేశించారు.

అక్రమ హోర్డింగులను తొలగిస్తాం

హైడ్రా కమిషనర్ రంగనాథ్



మున్సిపల్ కమిషనర్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

శంషాబాద్: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసుకున్న హోర్డింగులను తొలగిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. శుక్రవారం శంషాబాద్ మున్సిపాలిటీలో ఉన్న అక్రమ హోర్డింగులను ఉదయం హైడ్రా తొలగించే ప్రక్రియను చేపట్టడింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా అక్రమంగా ఏర్పాటు చేసుకున్న హోర్డింగులపై చర్యలు తీసుకునే అధికారం హైడ్రాకు ఉందన్నారు. ఇందులో భాగంగానే ఔటర్ లోపల ఉన్న అన్ని మున్సిపాలిటిలు, కార్పొరేషన్ల పరిధిలో ఉన్న అక్రమ హోర్డింగులను తొలగిస్తున్నామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా హోర్డింగులు ఏర్పాటు చేసుకుని డబ్బులు సంపాదిస్తున్నట్లు గుర్తించామన్నారు. అంతేకాకుండా ఒక హోర్డింగుకు అనుమతి తీసుకుని అనేక హోర్డింగులు ఏర్పాటు చేసుకున్న వారు కూడా ఉన్నారన్నారు. దీంతో ప్రభుత్వం పాలసీ ప్రకటించినా కొందరు అనధికారికంగా ప్రకటనలు వేస్తున్న విషయం కూడా ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టత తీసుకుని ముందుకెళ్తామన్నారు. పట్టణంలో ఉన్న అన్ని అక్రమ హోర్డింగులు తొలగించేస్తామన్నారు.

ముందే చెప్పిన 'సాక్షి'...

ప్రభుత్వ ఖజానాను గండి కొడుతూ శంషాబాద్ మున్సిపాలిటీలో అక్రమ హోర్డింగులు భారీగా కొనసాగుతున్న విషయంపై గతంలో 'సాక్షి' దినపత్రిక వెలుగులోకి తీసుకొచ్చిన విషయం పాఠకులకు విదితమే. 'అక్రమ హోర్డింగులతో ఖజానాకు గండి' అనే శీర్షికన డిసెంబర్‌లో 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది.


గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్టు



అత్తాపూర్: కారులో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అత్తాపూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అత్తాపూర్ ఎస్ఐ ఎస్.వెంకన్న సమాచారం మేరకు... బీదర్ నుంచి అక్రమంగా గంజాయిని తరలిస్తున్నట్లు పక్కా సమాచారం మేరకు పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నెంబర్ 160 వద్ద మాటు వేసి తనిఖీలు చేపట్టారు. ఫారెస్ట్ ఆఫీస్ ప్రాంతంలో హ్యూండాయ్ కారులో సులేమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ రేహాన్(23), ఎం.ఎం.పహాడీకి చెందిన మహ్మద్ సమీరుద్దీన్(23), సులేమాన్‌నగర్‌కు చెందిన మిర్ అరాఫత్ అలీ(28), ఆసిఫ్‌నగర్‌కు చెందిన అద్దుల రవికుమార్(28)లు గంజాయిని తీసుకొని వస్తున్నారు. కారును ఆపి తనిఖీ చేయగా అందులో 2.5 కిలోల గంజాయి లభించింది. బీదర్‌లోని జాఫర్ అనే వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్మేందుకు తరలిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. వారి నుంచి 2.5 కేజీల గంజాయి, ఒక కారు, ఐదు సెల్‌ఫోన్‌లు, రూ. 2500లను సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

సహకార వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం

డీసీసీబీ అధ్యక్షుడు కొత్త కురుమ సత్తయ్య



డీసీసీబీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ మల్లారెడ్డి

శంషాబాద్: సహకార రంగాన్ని బలోపేతం చేస్తున్నామని హైదరాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధ్యక్షుడు కొత్త కురుమ సత్తయ్య అన్నారు. పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ ముద్దం మల్లారెడ్డి ఆయనకు స్వాగతం పలికి సన్మానం చేశారు. రైతులు, ఖాతాదారుల సంక్షేమానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఖాతాదారుల ప్రయోజనమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. శంషాబాద్ పీఏసీఎస్ బలోపేతానికి కృషి చేస్తున్న పాలకవర్గ సభ్యుల పనితీరును ఆయన అభినందించారు. కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

మణికొండ: ఫంక్షన్ హాళ్ల యజమానులు, నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలని లేదంటే కేసులు నమోదు చేస్తామని నార్సింగి ఏసీపీ రమణగౌడ్ హెచ్చరించారు. శుక్రవారం నార్సింగి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి ఫంక్షన్‌హాల్ యజమానులు, నిర్వాహకులు ఏటా రాజేంద్రనగర్ డీసీపీ నుంచి, ఈవెంట్ వారీగా ఏసీపీ నుంచి అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఫంక్షన్ హాళ్లలో కార్యక్రమాలను పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రాత్రి 10 తరువాత శబ్ద కాలుష్యం చేస్తే సహించమన్నారు. సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, మద్యం పార్టీలు జరిగితే ఎక్సైజ్ అనుమతులు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నార్సింగి, మోకిల, శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, 70 మంది ఫంక్షన్ హాళ్ల యజమానులు పాల్గొన్నారు.

పాత పనులకే కొత్తగా ప్రారంభోత్సవాలా?

- మెట్రోపై ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సమాధానం చెప్పాలి
- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి కార్తీక్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

బండ్లగూడ: గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టి అభివృద్ధి పనులకు మాత్రమే ఇంచార్జి మంత్రి శ్రీధర్‌బాబు, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ గురువారం ప్రారంభోత్సవాలు చేశారని బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పి.కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. హైదర్‌షాకోట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం స్థానిక నిధులతోనే నిర్మించారని, జలమండలి రిజర్వాయర్‌లు, హిమాయత్‌సాగర్ ఫిల్టర్‌బెడ్‌లు, పంపింగ్ స్టేషన్‌లు గతంలో హైదరాబాద్ నగర శివారులోని అన్ని నియోజకవర్గాల పరిధిలోని ప్రజలకు తాగునీటిని ఇవ్వాలనే ముందు చూపుతో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రణాళికతోనే సాధ్యమన్నారు. అవన్నీ రూ. 3 కోట్ల నిధులతో చేపట్టిన పనులని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సంవత్సరం గడుస్తున్నా నియోజకవర్గానికి ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేదని, నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయంగా పార్టీ మారిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నిధులు రాబట్టే అంశాన్ని పట్టించుకున్న పాపాన పోవటం లేదన్నారు.

మెట్రో పోవటం అభివృద్ధా?

గచ్చిబౌలి నుంచి శంషాబాద్‌కు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన మెట్రో రైల్ రాజేంద్రనగర్ నియోజకవర్గంలోనే 90 శాతం పయనించేదన్నారు. అలాంటి మెట్రోను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసి నియోజకవర్గ ప్రజలకు తీరని ద్రోహం చేసినా ఎమ్మెల్యే పట్టించుకున్న పాపాన పోలేదన్నారు.

ఉప ఎన్నిక తప్పదు...

రాష్ట్రంలో పది నియోజకవర్గాలలో ఉప ఎన్నికలు రావటం తథ్యమని, అందులో రాజేంద్రనగర్ సైతం ఉంటుందన్నారు. ఉప ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

◆ మాజీ కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, రాముడు యాదవ్, చందు, సాయికుమార్‌రెడ్డి, సి.హెచ్.శ్రీనివాస్, శాంతి, మహేష్, మణికొండ మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం, నార్సింగి మున్సిపల్ ఇంచార్జి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.